ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ బోనాలు



అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌ యాదవ్‌

రాయదుర్గం: తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాసం బోనాల వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ రోడ్డులో వెలసిన రేణుకాఎల్లమ్మ ఆలయ బోనాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుత్‌ దీపాలు, రకరకాల పువ్వులు, మామిడి, వేప ఆకులతో అలంకరించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్‌ ఫండ్‌



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్‌ : అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ వరమని ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఆయన ఆదిత్యనగర్‌కు చెందిన మహ్మద్‌హుస్సేన్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి మంజూరైన రూ.2 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెందిన మహ్మద్‌హుస్సేన్‌కు అత్యవర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరు కావడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరికి సీఎం సహాయ నిధి కింద ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఆపదలో ఉన్న వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేరు మధురం... సమస్యలు అనేకం



అప్‌గ్రేడ్‌కు నోచుకోని ప్రభుత్వ పాఠశాల భవనం

'మధురానగర్‌ బస్తీ కహానీ'
- పట్టించుకోని అధికారులు
- బస్తీవాసుల అవస్థలు

రాయదుర్గం: ఒకప్పుడు పేదలే నివాసముండే బస్తీ నేడు మిద్దెలు, మేడలతో బస్తీ రూపురేఖలు మారినా సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్‌బస్తీలో నెలకొన్న సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బండరాళ్లతో కూడిన ఎత్తైన ప్రాంతంలో నెలకొన్న ఈ బస్తీలో మూడున్నర దశాబ్దాలుగా కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బస్తీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

నాడు వీకర్‌ సెక్షన్‌బస్తీ.. నేడు మధురానగర్‌..

ఒకప్పుడు రాయదుర్గం వీకర్‌ సెక్షన్‌ కాలనీగా 1885లో బస్తీని ఏర్పాటు చేసి పేదల కోసం క్వార్టర్స్‌ నిర్మించారు.
- ఆ తర్వాత 1991లో 'మధురానగర్‌'గా నామకరణం చేశారు.
- 10.33 గుంటల స్థలంలో సుమారు 300 ఇళ్లతో బస్తీ ఏర్పాటైందని.

నాటి క్వార్టర్స్‌ నేడు భారీ భవంతులుగా మారాయి.

బస్తీ విశేషాలివీ..
- మధురానగర్‌ బస్తీ కూడలిని గతంలో ×దాబా కూడలి×గా పిలవడంతో ఇప్పటికీ అదే ల్యాండ్‌ మార్క్‌గా గుర్తింపు పొందింది.
- నిజాం కాలంలో ఎదురుగడ్డ మైసమ్మ ఆలయాన్ని నిర్మించారు.
- దివ్యశ్రీ ఐటీ కారిడార్‌లో పలు ఐటీ సంస్థలు కొనసాగుతున్నాయి.
- రాయదుర్గం పోలీస్‌ స్టేషన్‌ను ఇక్కడే దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు
- మధురానగర్‌ బస్తీ చిన్నదే అయినా ఇక్కడ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల కొనసాగుతోంది.

బస్తీ సమస్యలు ఇవీ..
- రూ.700 కోట్ల వ్యయంతో మధురానగర్‌ కూడలి పక్కన ఉన్న గుట్టకు టన్నెల్‌ ఏర్పాటు పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.
- రేషన్‌షాపు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- భూగర్భ డ్రేనేజీ వ్యవస్థ లేక అవస్థలు పడుతున్నారు.
- దశాబ్దాల తరబడి 5వ తరగతికే పరిమితమైన ప్రభుత్వ పాఠశాలను అప్‌గ్రేడ్‌ చేయాలి.
- స్థానికంగానే ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఉండడంతో అక్కడే జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఇటీవల ఎమ్మెల్యేకు విద్యా కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు.
- నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్‌ట్యాంక్‌ను అందుబాటులోకి తేవాలి

బస్తీలో జరిగిన అభివృద్ధి పనులు ఇవీ..
- రూ.45 కోట్లతో బస్తీకూడలి నుంచి ఖాజాగూడ మీదుగా ఓఆర్‌ఆర్‌ అండర్‌బ్రిడ్జి వరకు మోడల్‌ రోడ్డు
- ప్రభుత్వ జూనియర్‌ కళాశాలకు రూ.86 లక్షలతో భవనం నిర్మాణం.
- ఎదురుగడ్డ మైసమ్మ ఆలయ నిర్మాణం
- అంగన్‌వాడీ కేంద్రానికి రూ.3 లక్షలతో సొంత భవన నిర్మాణం
- నిర్మాణ్‌ సంస్థ పలు ఐటీ సంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు కిచెన్‌షెడ్‌, డైనింగ్‌ హాల్‌ నిర్మాణం
- దివ్యశ్రీసంస్థ రూ.33 లక్షలతో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల అదనపు తరగతి గదుల నిర్మాణం
- రూ.1.05 కోట్లతో సీసీరోడ్లు, రూ.20 లక్షలతో యూజీడీ లైన్‌ నిర్మాణం చేశారు.
- బస్తీ ముందు ఉండే ప్రధాన సింగిల్‌ రోడ్డును ఆరులేన్ల రోడ్డుగా మార్చడం
- ఎదురుగడ్డ మైసమ్మ దేవాలయ ప్రధాన రోడ్డుపై ఫుట్‌ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం



డ్రైనేజీ కాలువ పరిస్థితి





నిరుపయోగంగా మినీ వాటర్‌ ట్యాంక్‌

రేషన్‌షాప్‌ ఏర్పాటు చేయాలి



మధురానగర్‌లో రేషన్‌షాప్‌ ఏర్పాటు చేస్తే దూరంబారం తగ్గుతుంది. మోడల్‌ రోడ్డు సర్వీస్‌ రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో, ర్యాంపుల నిర్మాణం చేపట్టక పోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. బస్తీకి మంచినీటిని సక్రమంగా విడుదల చేయాలి.

– వెంకటేష్‌
ప్రధాన కార్యదర్శి మధురానగర్‌బస్తీ

సర్వీస్‌ రోడ్డు నిర్మించాలి



బస్తీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సర్వీస్‌ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. సైకిల్‌ ట్రాక్‌ పనులను పార్లమెంటు ఎన్నికల సమయంలో మధ్యలోనే నిలిపివేశారు. వాటిని మళ్లీ పునరుద్ధ రించాలి. డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించాలి. స్థానిక ప్రభుత్వ పాఠశాలను అప్‌గ్రేడ్‌ చేసేలా చొరవ తీసుకోవాలి. ప్రభుత్వ జూనియర్‌ కళాశాలకు పూర్తి స్థాయి మౌలిక వసతులు కల్పించాలి.

– రమేష్‌గౌడ్‌
మధురానగర్‌ బస్తీ

శాకంబరి అలంకారంలో అన్నపూర్ణాదేవి



శాకంబరిగా అన్నపూర్ణాదేవి

రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మరు శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం గచ్చిబౌలిలోని శివ సాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, ఆలయ మేనేజింగ్‌ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి పాల్గొన్నారు.

శిల్పారామంలో గురుపూజోత్సవం



మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా పద్మవిభూషన్‌ వెంపటిచిన్న సత్యం కుమార్తె చావళి బాలాత్రిపురసుందరి శిష్యబృందం గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిపాహి, జతిస్వరం, ఆనందతాండవం, దశావతారం, సూర్యస్తుతి, బృందావన నిలయ్‌, తిల్లాన అంశాలను సౌమ్య, సంయుక్త, వైష్ణవి, సహన, వెంకట్‌, శశికళ, శ్రీయ, శర్మ, ప్రియ, హాసిని, అనురిత, ఇషితా తదితరులు ప్రదర్శించారు. శాశ్వతిబెనర్జీ శిష్యబృందంచే కథక్‌ నృత్య ప్రదర్శనలో రాధాకృష్ణ, గురువందన, సూఫీ సంగీతం తదితర అంశాలను ప్రదర్శించారు.

రాజ్యాంగాన్ని రక్షించే వారి సంఖ్య తగ్గుతుంది



మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్‌

హఫీజ్‌పేట్‌ : ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, రాజ్యాంగాన్ని, సమానత్వాన్ని వ్యతిరేకించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండగా, మరో వైపు వాటిని రక్షించే వారి సంఖ్య తగ్గుతుందని ఆర్థిక, రాజకీయ వేత్త, విశ్లేషకులు డాక్టర్‌ పరకాల ప్రభాకర్‌ అన్నారు. ఆదివారం కొండాపూర్‌ సీఆర్‌ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి పరిశోధన కేంద్రంలో ఆయన 'నీలం రాజశేఖర్‌రెడ్డి' స్మారక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఆర్‌సీ డైరెక్టర్‌ డాక్టర్‌ టి.సురేష్‌ బాబు, సీఆర్‌ ఫౌండేషన్‌ అధ్యక్షులు డాక్టర్‌ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరకాల ప్రభాకర్‌ మాట్లాడుతూ దేశంలో తాజా పరిణామాలు, ఆర్థిక, రాజకీయ అంశాలపై రాజకీయ కార్యకర్తల్లో చైతన్యం తీసుకువచ్చేలా శిక్షణ తరగతులను నిర్వహించేందుకు నీలం రాజశేఖర్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు ఇప్పుడు చాలా వరకు తగ్గాయన్నారు. స్వాతంత్ర్యంలో లేనివారు దేశ భక్తులుగా మార్కెటింగ్‌ స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్రలేని సంస్థ, వ్యక్తులు ప్రస్తుతం దేశ భక్తులుగా మార్కెటింగ్‌ చేసుకుంటున్నారన్నారు. గంగానదిలో వందల మృతదేహాలు తేలినా సమాజం పట్టించుకోవడం లేదన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌, రాజస్థాన్‌, హర్యానా రాష్ట్రాలకు చెందిన యువకులు ఉద్యోగాల కోసం ఇజ్రాయిల్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డు వద్ద బారులు తీరడం దేశంలో నిరుద్యోగ సమస్యకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ ఫౌండేషన్‌ కోశాధికారి చెన్నకేశవులు, ఫౌండేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

పెద్దచెరువుకు గండి



జిన్నారం(పటాన్‌చెరు): కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఊట్ల గ్రామంలో గల పెద్ద చెరువు తూముకు గండి పడింది. మత్స్య సహకార సంగం జిల్లా డైరెక్టర్‌ మహేశ్‌ ఆధ్వర్యంలో మత్స్యకారులు గండి పూడ్చేశారు. జిల్లా అధికారులు స్పందించి, తూముకు శాశ్వత పరిష్కారం చేయాలని మహేశ్‌ డిమాండ్‌ చేశారు.

కలెక్టర్‌ ఆదేశాలు బేఖాతరు



కూల్చివేసిన స్థలంలో నిర్మించిన కాంప్లెక్స్‌

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం మాదారంలో గల సర్వేనంబర్‌ 283, 284, 620, 627లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కలెక్టర్‌ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మార్చి నెలలో కూల్చివేశారు. నెల రోజుల్లోనే మళ్లీ నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే రెవెన్యూ అధికారులు తమకేమి పట్టించుకోవటం లేదు. ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయమై అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

జనావాసంలోకి కలుషిత నీరు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని పలు రసాయన పరిశ్రమల నుంచి వర్షం నీటితో కలిసి యథేచ్ఛగా కలుషిత నీరు బయటకు వస్తుంది. వరద ఖాజీ చెరువులోకి చేరి నిండింది. మిగతా జలం బయటకు వెళ్లి కుంటలను సైతం కలుషితం చేస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న రసాయన పరిశ్రమలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే పర్యావరణ పరిరక్షణ



వనమహోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ తదితరులు

శేరిలింగంపల్లి: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి డివిజన్‌ సుదర్శన్‌నగర్‌ కాలనీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీ అసోసియేషన్‌ ఆఫీస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ గ్రీనరీ అభివృద్ధితో కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటికో మొక్కను నాటాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటయ్య, సెక్రటరీ శ్రీనివాస్‌, జాయింట్‌ సెక్రటరీ విష్ణు, ట్రెజరర్‌ సుధాకర్‌, జాయింట్‌ ట్రెజరర్‌ కోటేశ్వరరావు, కాలనీ వాసులు ఉపేందర్‌, జగదీష్‌, రాజేంద్రచారీ, యోగేష్‌, సుబ్రమణ్యం, నిర్మల్‌ కుమార్‌, యోగానంద, శ్రీధర్‌రెడ్డి, అరుణ్‌, అర్బన్‌ బయోడైవర్సిటీ సూపర్‌వైజర్‌ గోపాల్‌, నాయకులు రమేష్‌, కొయ్యాడ లక్ష్మణ్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు



ఖర్గేకు నమస్కరిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినం సందర్భంగా కాంగ్రెస్‌ నేత నీలంమధు ముదిరాజ్‌ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం బెంగళూరులోని ఆయన నివాసంలో మాజీ సీఎం వీరేంద్ర పాటిల్‌ కుమారుడు కైలాష్నత్‌ పాటిల్‌, ఫిషరీస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ నారాయణ్‌రావు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌గోపాల్‌ రెడ్డిలతో ఆయన వెళ్లారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ పార్లమెంట్‌లో పేద ప్రజల పక్షాన ఖర్గే గొంతుక వినిపిస్తున్నారన్నారు. మతతత్వ రాజకీయాలను దీటుగా ఎదుర్కొంటూ పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారని కొనియాడారు.

మినీ థియేటర్‌ ప్రారంభం



హఫీజ్‌పేట్‌: మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గోకుల్‌ ప్లాట్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీబీ స్టూడియోస్‌ మినీ థియేటర్‌ను ఆదివారం రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, సంజీవరెడ్డి, యాదగిరి గౌడ్‌, శేరి సతీష్‌రెడ్డి, ఆదినారాయణ, జీవిరెడ్డి, రాజేష్‌, శ్రీనివాస్‌, సత్యం, యువ నాయకులు ప్రసాద్‌, లక్ష్మణ్‌, మూర్తి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చెన్నై ఫెర్టిలిటీ సెంటర్‌ ప్రారంభం



చెన్నై ఫెర్టిలిటీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న టి.సుబ్బిరామిరెడ్డి తదితరులు

మాదాపూర్‌: కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని కావూరిహిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నై ఫెర్టిలిటీ సెంటర్‌ను ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త టి.సుబ్బిరామిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నై ఫెర్టిలిటీ సెంటర్‌ చైర్మన్‌ వీఎం.థామస్‌ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్‌లో సమగ్ర సంతానోత్పత్తికి పరిష్కారాలు లభిస్తాయని తెలిపారు. చెన్నై, హైదరాబాద్‌, కోల్‌కతా, తిరుపతి, పాండిచ్చేరిలలో తమ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా బంగ్లాదేశ్‌, దుబాయ్‌లలో కూడా సేవలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు పోతుల రాజేందర్‌ పాల్గొన్నారు.

ఒక వర్సిటీకి దాశరథి పేరు పెట్టాలి

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: రాష్ట్రంలో ఏదో ఒక విశ్వవిద్యాలయానికి దాశరథి పేరు పెట్టాలని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ తెలుగు శాఖ మాజీ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆన్‌లైన్‌ ద్వారా గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ నుంచి ఆయన కరీంనగర్‌లోని భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్‌ వైరాగ్యం ప్రభాకర్‌ అధ్యక్షతన దాశరథి కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ నిత్య పోరాట స్ఫూర్తిగా దాశరథి నిలుస్తారని, నిజాం పాలకుల చేతిలో తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కోల్పోయి జీవచ్ఛవాల్లా బతుకుతున్న రోజుల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు దాశరథి కృష్ణమాచార్య అని కొనియాడారు. దాశరథి స్ఫూర్తిని గుర్తు చేసుకోవడానికి ఇటువంటి కవి సమ్మేళనాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు కవులు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మానసికంగా శక్తివంతం కావాలి

రాయదుర్గం: తల్లుల్లో మానసిక ఆరోగ్య శ్రేయస్సును పెంపొందించడమే తమ లక్ష్యమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఖాజాగూడలో ప్రాజెక్ట్‌ రష్మీ, ఎన్టీట మర్థమ్‌ రెసొనేటింగ్‌ రెసిలెన్స్‌, టోటల్‌ సొల్యూషన్స్‌ రిహాబిలిటేషన్‌ సొసైటీ,టాక్‌ అండ్‌ లెర్న్‌ థెరపీ సెంటర్‌ ఆధ్వర్యంలో ×మమ్స్‌ అన్‌ప్లగ్డ్‌× కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్డ్‌ సైకియాట్రిస్ట్‌ డాక్టర్‌ నిత్య మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూ ముందుకెళ్లడానికి తల్లులను శక్తివంతం చేయడమే ×మమ్స్‌ అన్‌ప్లగ్డ్‌× లక్ష్యమన్నారు. టోటల్‌ సొల్యూషన్స్‌ వ్యవస్థాపకురాలు, సైకాలజిస్ట్‌ డాక్టర్‌ పూజారూ మాట్లాడుతూ తల్లులందరికీ సహాయాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఒంటరి తల్లులు, న్యూరోటైపికల్‌, న్యూరో డైవర్జెంట్‌ పిల్లలు ఉన్న తల్లులు తమ అనుభవాలను పంచుకోవడానికి అలాగే ఒకరినొకరు మద్దతు ఇచ్చుకోవడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు శ్వేతారెడ్డి, రవికాంత్‌, ప్రతిమగిరి, సనాస్మృతి, నబత్‌లఖాని ప్రసంగించారు.





'మామ్స్‌ అన్‌ప్లగ్డ్‌' కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు, తల్లులు




సాయిబాబాను దర్శించుకున్న గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి



పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్‌ కొమిరిశెట్టిసాయిబాబా..

గురు దేవోభవ..



జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో..



శివసాయిక్షేత్రంలో సాయిబాబా ఆలయంలో..

ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు
- షిర్డీసాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- హోమాలు, ప్రత్యేక అలంకారం

రాయదుర్గం: గురుపూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని షిర్డీసాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం షిర్డీసాయిబాబావారికి అర్చనలు, ప్రత్యేక అలంకారం, అభిషేకాలు చేశారు. అంతకుముందు సాయిబాబావారికి పాలాభిషేకం చేశారు. టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయం, జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో, గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. షిర్డీసాయిబాబా పల్లకిసేవలో భక్తులు కోలాటం నిర్వహించారు.

-టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో సాయిబాబాను గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి , కాలనీవాసులు, ఆలయ నిర్వాహకులతో కలిసి దర్శించుకున్నారు.

- ఖాజాగూడ సాయిఐశ్వర్యకాలనీలోని షిర్డీసాయిబాబా ఆలయంలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్‌ కొమిరిశెట్టి సాయిబాబా కాలనీవాసులు, ఆలయ నిర్వాహకులతో కలిసి దర్శించుకున్నారు.